సాక్షి
నిర్మల్
శుక్రవారం : 30 : మే : 2025



భవితకు భరోసా..!

8లో▸

భవిత కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు పోషకుల సమావేశం

నిర్మల్ రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పోషకుల సమావేశం నిర్వహించాలని ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులతోపాటు, గ్రామపంచాయతీ, మున్సి పల్ వార్డులలోని యువతీ యువకులను, స్థానిక ప్రజాప్రతినిధులను, నాయకులను ఆహ్వానించాలని తెలిపారు. సమావేశంలో బడిబాట కార్యక్రమం, పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. సమావేశానికి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /26.3

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న గాయత్రి లోమ్టే

భైంసాటౌన్: నేటి ఆధునిక కాలంలో మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ వాటిని కాపాడుకోవాలని విశ్వ మాంగళ్య సభ దక్షిణ భారత ఇన్‌చార్జి గాయత్రి లోమ్టే అన్నారు. గురువారం భైంసాకు వచ్చిన ఆమె స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మాట్లాడారు. మహిళలకు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలపై వివరించేందుకు విశ్వమాంగల్య సభ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహిళలకు ధ్యానం, ప్రాణాయామం, యోగా, శ్లోకాలు నేర్పిస్తున్నట్లు వివరించారు. తద్వారా మహిళల్లో దేశభక్తిని పెంపొందింపచేయడం, విద్యార్థి దశనుంచే బాలికలకు మాతృత్వంపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేణి, మండల అధ్యక్షులు సుష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రావుల రాము పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి బాక్సింగ్ సెలక్షన్స్

నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా స్థాయి అండర్ 17 జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ సెలక్షన్స్ ఈ నెల 31న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ జిల్లా సెక్రెటరీ చందుల స్వామి తెలిపారు. 01, జనవరి 2009 నుంచి 01, డిసెంబర్ 2010 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. సెలక్షన్స్‌కు వచ్చేవారు తమ ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9966677105 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పంట మార్పిడి పద్ధతి అవలంబించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య

లోకేశ్వరం: రైతులు పంట మార్పిడి పద్ధతి అవలంబించాలని ముథోల్ ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య అన్నారు. మండలంలోని రాజూర గ్రామ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. వానాకాలంలో సాగుచేసే పంటలపై రైతుల ప్రశ్నలకు నర్సయ్య సమాధానం ఇచ్చారు. జీవన ఎరువుల వాడకం, రసాయనిక పురుగు మందుల వాడకం, తక్కువ యూరియా వడటం ద్వారా ఆదాయాన్ని ఎలా పొందాలో వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ చెట్లు పెంచడం వలన పర్యావరణానికి కలిగే మేలును తెలియజేశారు. వివిధ పంటలకు అవసరం మేరకు రసాయనాల వినియోగిస్తే పంట దిగుబడి శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఇన్‌చార్జి పశువైద్యాధికారి రవీందర్, ఏవో గిరిరాజ్, ఏఈవోలు మౌనిక, రుచిత, ఎఫ్‌పీవో నవీన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



రైతులతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

లక్ష్మణచాంద: మండలంలో వరి కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని తిర్పెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున కల్లాల్లో ధాన్యం తడిసి పోతుందని తెలిపారు. రైతులకు నష్టం జరుగకుండా కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. గన్నీ సంచులు త్వరగా ఇచ్చి తూకం వేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. కూలీల సంఖ్య పెంచాలని, లారీల సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఆర్ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది దినకర్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా.. ప్రణాళికాబద్ధంగా..

- సర్కారుబడులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు
- ఇప్పటికే ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో శిక్షణ
- తాజాగా రాష్ట్రస్థాయిలో శిక్షణకు ఎంఈవోలు



బడీడు పిల్లలను గుర్తించిన ఉపాధ్యాయులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి పాఠశాల విద్యాశాఖను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య అందించడానికి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు మౌలిక సదుపాయాలు సమకూర్చడం, ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ అందించడం, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టింది. జిల్లాలో 3 మున్సిపాలిటీలు, 19 మండలాల పరిధిలో 735 పాఠశాలలు ఉండగా, 69 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఎంఈవోల నియామకం

పాఠశాలల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచేందుకు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండల స్థాయిలో మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్లు (ఎంఈవోలు)ను నియమించి, వారికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మూడు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి. రమేశ్, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా వంటి ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, పాఠశాలల పర్యవేక్షణ, విద్యా నాణ్యత మెరుగుదలకు సంబంధించిన సూచనలు అందించారు. జిల్లాలోని 19 మండలాలకు చెందిన ఎంఈవోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

జూన్ 6 నుంచి బడిబాట..

2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ''బడిబాట'' కార్యక్రమాన్ని జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామసభలు, ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించడం, డ్రాప్‌ఔట్ విద్యార్థులను తిరిగి చేర్పించడం, తల్లిదండ్రుల సమావేశాలు, పాఠశాలల అలంకరణ, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ వంటి కార్యకలాపాలు ఉన్నాయి. అలాగే, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ దినోత్సవం, బాలికా విద్యా దినోత్సవం నిర్వహించి, బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తారు. డిజిటల్ సాంకేతికత, మౌలిక సదుపాయాలను తల్లిదండ్రులకు పరిచయం చేయడం, క్రీడా పోటీలు, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు కూడా జరుగుతాయి.

సమర్థవంతమైన బోధన కోసం..

విద్యా నాణ్యతను పెంచేందుకు ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై శిక్షణ అందించడం అవసరమని ప్రభుత్వం భావించింది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ మూడు విడతలుగా వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లాస్థాయి నుంచి సబ్జెక్టు వారీగా ఎంపికైన డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ (డీఆర్పీలు) రాష్ట్రస్థాయిలో ఎస్సీఈఆర్టీ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. వీరు మండలస్థాయిలో ఎంపికైన మాస్టర్ రిసోర్స్ పర్సన్స్ (ఎంఆర్పీలు)కు శిక్షణ అందించారు. ఈ శిక్షణలో ఆధునిక బోధనా పద్ధతులు, ఎల్ఐపీ, ఎఫ్ఎల్ఎన్ వంటి నైపుణ్యాలు విద్యార్థుల్లో పెంపొందించే అంశాలపై దృష్టి సారించారు. ఇప్పటికే రెండు విడతల శిక్షణ పూర్తి కాగా, మూడో విడత శిక్షణ ఈనెలాఖరు నాటికి ముగియనుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల సంఖ్యను పెంచడం, విద్యా సంవత్సరంలో అమలు చేయాల్సిన కార్యాచరణలపై కూడా చర్చించింది.

బడుల బలోపేతం కోసం..



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల నుంచి మొదలుకుని డీఈవోల వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. ఈ విద్యా సంవత్సరం సర్కారు బడుల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాం. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. పాఠశాలల్లో నాణ్యమైన విద్య విద్యార్థులకు అందేలా పటిష్టపర్యవేక్షణ ఉంటుంది.

– పి.రామారావు, డీఈవో

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికను పూలతో అలంకరించి, ప్రొటోకాల్ నిబంధనల మేరకు సీటింగ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థులతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంటులు, షామియానాలు, తాగునీరు, అల్పాహారం, పండ్ల సరఫరా నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. పరిసరాలలో శుభ్రత పాటించాలని, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యశాఖ అత్యవసర మందులతోసహా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం సహా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీటి లభ్యత బట్టి పంటలు వేసుకోవాలి

- ముందస్తు వర్షాలు సాగుకు అనుకూలం
- మక్క, సోయా, పసుపు విత్తుకోవచ్చు
- విత్తన కొనుగోలుకు రశీదు తప్పనిసరి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో డీఏవో అంజిప్రసాద్



రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న అంజిప్రసాద్

నిర్మల్‌చైన్‌గేట్: పంటల అవసరాలు, నీటి లభ్యతను బట్టి సాగును నిర్ణయించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ అన్నారు. నైరుతి రుతుపవనాల ప్రవేశంతో జిల్లాలో కురుస్తున్న ముందస్తు వర్షాలు సాగుకు అనుకూలమేనని తెలిపారు. తేలికపాటి భూముల్లో ఆరు, బరువు నేలల్లో ఏడు సెంటీ మీటర్ల వర్షం కురిసి మట్టి తేమగా ఉంటే మొక్కజొన్న, సోయా, పసుపు విత్తుకోవచ్చన్నారు. రానున్న రోజుల్లో వర్షాలను అంచనా వేయలేమని, నీటి సౌకర్యం ఉన్న పంటలకైతే డోకా లేదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని తెలిపారు. గురువారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో డీఏవో మాట్లాడారు. ముందస్తు వర్షాలతో సాగుపై సందేహాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల లభ్యతపై రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

రైతు: పసుపులో అడుగు రోగం రాకుండా ఏటువంటి చర్యలు తీసుకోవాలి? – గంగారెడ్డి, పెంబి

డీఏవో: పసుపులో అడుగు రోగం రాకుండా ట్రైకోడెర్మా విరిడిని వాడాలి. ప్రస్తుతం ఇది ఆదిలాబాదులో దొరుకుతుంది. మీరు మీ సంబంధిత ఏఈవోను సంప్రదిస్తే వారు తెప్పిస్తారు.

రైతు: ఐదు రోజులుగా వర్షం కురుస్తుంది. మొక్కజొన్న పంట వేసుకోవచ్చా?

– ముత్యం, రాచాపూర్, లక్ష్మణచాంద

డీఏవో: నీటి వనరులు అధిక మొత్తంలో ఉంటే మొక్కజొన్న పంటకు అనుకూలం. జూన్ మొదటి వారంలో మేలైన రకం చూసి విత్తుకోవచ్చు.

రైతు: నాకు రెండెకరాల భూమి ఉంది. ఇప్పుడే పసుపు విత్తుకోవచ్చా?

– మల్లేశ్, పీచర, లక్ష్మణచాంద

డీఏవో: సందేహం లేకుండా పసుపు విత్తనాలు వేసుకోవచ్చు. ముందుగా విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తిన తర్వాత అడుగు మందులు కూడా వేసుకోవచ్చు. కత్తెర పురుగు వస్తే విషపు ఎరను తయారు చేసి చల్లాలి. అదనపు సమాచారం కోసం స్థానిక ఉద్యాన శాఖ అధికారులను సంప్రదిస్తే మరిన్ని సూచనలు సలహాలు ఇస్తారు.

రైతు: దాన్ 75 రకం జిల్లాలో అందుబాటులో ఉన్నాయా?

– మత్త రాజా బాబు, (మందపల్లి, పెంబి.), నారాయణ (నర్సాపూర్(జి))

డీఏవో: దాన్–75 అనే కొత్తరకం వరి విత్తనాన్ని అగ్రికల్చర్ యూనివర్సిటీ తయారు చేసింది. ఈ విత్తనాలు మార్కెట్‌లోకి ఇంకా రాలేదు. కానీ రాజేంద్రనగర్ యూనివర్సిటీకి వెళ్తే ఇస్తున్నారు. జిల్లాకు ఈ విత్తనాలు వస్తే రైతులందరికీ సమాచారం ఇస్తాం.

రైతు: జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? – గంగారెడ్డి, నర్సాపూర్(జి))

డీఏవో: జీలుగు విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. ఈరోజు దిలావర్‌పూర్ మండలంలో రైతులకు పంపిణీ చేశాం. ఎకరానికి 10 కిలోల జీలుగ విత్తనాలకు ఒక యూరియా బస్తా మాత్రమే వాడాలి.

రైతు: నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలి?

– రాజన్న, జామ్, సారంగాపూర్

డీఏవో: నకిలీ విత్తనాలు గుర్తించాలంటే మనం తీసుకున్న విత్తనాల పాకెట్ మీద ఉన్న లాట్ నంబర్‌ని బిల్లు మీద తప్పనిసరిగా రాయించాలి. అలా షాపు యజమాని రాయకపోతే అది నకిలీ విత్తనంగా భావించాలి. అలా మీ దృష్టికి వస్తే వ్యవసాయ శాఖలు అధికారులకు ఫిర్యాదు చేయాలి.

రైతు: వరిలో ఏయే విత్తనాలు మేలైనవి;

– బలరాం, లోకేశ్వరం

డీఏవో: వరిలో చాలా రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అందులో దోమ, అగ్గి తెగులు వంటి చీడపీడలను తట్టుకునే రుద్రూర్ –1200, జేజీఎల్–27356, 1248, 11118, 1798, 2 –44, 5 –5204. ఆర్ఎస్ఆర్–15048, కునారం– 1638, ఎంటీ యూ–1262 రకాలు మేలైనవిగా చెప్పొచ్చు. ప్రభుత్వం సూచించిన 33 రకాల విత్తనాలను వేసుకుంటే బోనస్ వచ్చేందుకు అవకాశం కూడా ఉంటుంది.

రైతు: మక్క, సోయా విత్తనాలు ఎప్పటి వరకు వేసుకోవచ్చు? – భూమన్న, కుంటాల

డీఏవో: ముందస్తుగా కురుస్తున్న వర్షాలు మక్క, సోయా సాగు చేసేందుకు అనుకూలమే. నేల బాగా తడిసి తేమతో ఉంటే విత్తనాలు విత్తుకోవచ్చు. జూలై 15 వరకు కూడా సాగు చేసుకోవచ్చు. విత్తనం వేసిన తర్వాత వర్షాలు లేకపోతే ఎండకు విత్తనం కుళ్లిపోయే అవకాశం ఉంటుంది. నీటి సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచు కుంటే మంచిది.

రైతు: ఎర్రచౌక భూమిలో ఎటువంటి పంటలు వేయాలి?

– దాసరి సుజాత, విట్టాపూర్, కుంటాల

డీఏవో: ముందస్తు వర్షాలు కురుస్తున్న కారణంగా మొదట నేలని పూర్తిగా చదును చేసుకోవాలి. జూన్ మొదటి వారంలో ఎర్రచౌక భూములలో తొందరగా చేతికి వచ్చే పంటలను మాత్రమే వేసుకోవాలి.

రైతు: మా పంట పొలాల్లో నీరు బాగా నిలువ ఉంటుంది. ఈ భూమిలో ఎటువంటి పంటలు వేసుకోవచ్చు?

– శంకర్, మహాగావ్, భైంసా

డీఏవో: మొదట మీ పంట పొలాల్లో ఉన్న నీటిని నాగలి పెట్టి కాలువలు తీసి బయటకు పంపించాలి. నీరు ఆగకుండా చూసుకోవాలి. ఇటువంటి నేలలో కంది, పత్తి వంటి పంటలు వేసుకోవచ్చు.

గోవులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు
- ఎస్పీ జానకీషర్మిల



సెయింట్ థామస్ స్కూల్ వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకీషర్మిల హెచ్చరించారు. గోవుల రవాణా విషయంలో వెటర్నరీ డాక్టర్ నిబంధనలు పాటించాలని సూచించారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సోన్ మండలం గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, కొండాపూర్ సెంట్ థామస్ స్కూల్ వద్ద గల చెక్ పోస్టును గురువారం ఎస్పీ తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. గోవుల రవాణాను అడ్డుకునేందుకు నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గోవుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చెక్ పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు..

పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాలలో మత సామరస్యానికి భంగం కలిగించేలా, విద్వేషాలు రెచ్చగొట్టేలా, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. అంతేకాకుండా జిల్లా ముఖ్య కార్యాలయంలో సోషల్ మీడియా సెల్ ప్రత్యేకంగా పరిశీలన చేస్తుంటారని తెలిపారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

బక్రీద్ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి, భద్రతాపరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

భైంసాటౌన్: ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో హిందూ, ముస్లిం మతపెద్దలతో పీస్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు నమ్మవద్దని, ఏదైనా సమస్య తలెత్తితే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు సహించేది లేదన్నారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సీఐ గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణి



మాట్లాడుతున్న ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి

నిర్మల్‌టౌన్: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని నిర్మల్ జిల్లా ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, ఆర్డీవో రత్న కల్యాణి సూచించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న బక్రీద్ పండుగకు మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమంగా గోవులను వధిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, అర్బన్ తహసీల్దార్ రాజు, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నారు.

ధాన్యం తిప్పి పంపిన మిల్లర్



ధాన్యం అన్‌లోడ్ చేస్తున్న రైతు

నర్సాపూర్(జి): ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునే రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు అధికారులు తడిచిన ధాన్యం కొంటామని చెబుతున్నారు. మరోవైపు మిల్లర్లు ధాన్యం సరిగా లేదని తిప్పిపంపుతున్నారు. మండలంలోని డొంగుర్గాంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టారు. తురాటి గ్రామానికి చెందిన గొర్ల ప్రవీణ్‌కు చెందిన ధాన్యాన్ని ఈనెల 27న తూకం వేసి ట్రాక్టర్లలో కుంటాల రైస్ మిల్లుకు తరలించారు. ట్రక్ షీట్లో మాత్రం రైతు, రైస్ మిల్లు పేర్లు, కొనుగోలు చేసిన ధాన్యం బస్తాల వివరాలు ఏమీ లేకుండా తరలించారు. ఇలా తరలించిన ధాన్యాన్ని రెండు మూడు రోజుల తర్వాత మిల్లర్లు తేమశాతం సరిగా లేదనే కారణంతో గురువారం వెనక్కి పంపించారు. దీంతో సదరు రైతు చేసేదేమీ లేక మళ్లీ ధాన్యాన్ని ఆరబెడుతున్నాడు.

ధాన్యంబస్తాతో కలెక్టరేట్‌కు..

- తేమ సాకుతో కొనడం లేదంటూ ఆవేదన..
- కలెక్టర్ చాంబర్ ఎదుట రైతు నిరసన



ధాన్యం బస్తాతో కలెక్టర్ చాంబర్ వద్ద రైతు

నిర్మల్: తేమ సాకుతో తమ ధాన్యం కొనడం లేదని, కోతలు ఎక్కువగా పెడుతున్నారని ఓ రైతు కుటుంబం ధాన్యంతో కలెక్టరేట్‌కు వచ్చింది. లక్ష్మణచాంద మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు లింగన్న, శ్రీనివాస్ ఇద్దరూ గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. తమవెంట తీసుకువచ్చిన ధాన్యం బస్తాను మోసుకుంటూ కలెక్టర్ చాంబర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వడ్లు పోసి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా, సిబ్బంది అడ్డుకున్నారు.

కొర్రీలు పెడుతున్నారు..

బాబాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో సుమారు 600 బస్తాల ధాన్యం కొనడం లేదని వారు పేర్కొన్నారు. ధాన్యం తేమశాతం రావడం లేదని, ఎక్కువ కటింగ్ చేస్తానని ఇబ్బంది పెడుతున్నారని వారు వాపోయారు. తమ బాధ తెలుపాలన్న ఉద్దేశంతోనే వడ్లబస్తాలతో కలెక్టరేట్‌కు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌ను కలవగా, ధాన్యం కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

నిర్మల్: తెలంగాణ ఉద్యమకారుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉద్యమకారుల ఫోరమ్ చైర్మన్ కొట్టె శేఖర్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ కిరణ్‌రెడ్డి, పాకాల రాంచందర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తోందని పేర్కొన్నారు. జూన్ 2న తమ న్యాయమైన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, మేధావులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

క్లుప్తంగా

పాముకాటుతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

కెరమెరి: మండలంలోని శివగూడలో టేకం గుండయ్యకు చెందిన ఎద్దును గురువారం పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఉదయం మేతకోసం వెళ్లిన ఎద్దు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో గుండయ్య మేత మేస్తున్న ప్రదేశానికి వెళ్లిచూడగా మృతి చెంది కనిపించింది. ఎద్దు కాలుకు రెండు పాము కాట్లు కనిపించాయన్నాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గుండయ్య కోరుతున్నాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



దత్తు (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద మంగళవారం వరద నీటిలో గల్లంతైన దత్తు మృతదేహం గురువారం పూసాయి గ్రామ సమీపంలో లభ్యమైనట్లు జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూమి కాజేసిన ఒకరిపై కేసు

తలమడుగు: నకిలీ పత్రాలు సృష్టించి 25 ఎకరాల భూమిని కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల శివారు 246 సర్వేనంబర్‌లో ఉన్న 25 ఎకరాల భూమిని 50 ఏళ్ల క్రితం దేవాపూర్ గ్రామానికి చెందిన అమీరొద్దీన్‌కు ప్రభుత్వం అప్పగించింది. అట్టి భూమిని తలమడుగు మండల కేంద్రానికి చెందిన క్లోం కరుణాకర్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అమీరొద్దీన్ వారసుడిగా లతీఫొద్దీన్ పేరు మీద పట్టా చేయించాడు. ఆతర్వాత కరుణాకర్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు క్లోం కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు.

గంజాయి సేవించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి సేవించిన బంగారుగూడకు చెందిన ఫేరోజ్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పొచ్చర సర్వీస్ రోడ్డు ప్రాంతంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా విచారించి పరీక్షలు నిర్వహించగా పాజిటీవ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. దీంతో ఫెరోజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుక్కల దాడిలో నీలుగాయికి గాయాలు



గాయపడిన నీలుగాయి

బోథ్: మండలంలోని కంటెగాం గ్రామ సమీపంలోని అడవిలో బుధవారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో నీలుగాయికి గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గురువారం అటవీశాఖ అధికారులు పశువైద్యాధికారులను పిలిపించి చికిత్స చేయించి అడవిలో వదిలేశారు.

వీధికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



చేతికి గాయాలతో మహిళ

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ ఎస్సీ కాలనీలో గురువారం వీధి కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కళావతి, లక్ష్మి, లస్ను బాయి ఇంటి ముందు కూర్చుని ఉండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ముగ్గురికి గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

భవితకు భరోసా..!

- మౌలిక వసతులకు నిధులు
- ఉమ్మడి జిల్లాకు రూ.1.59 కోట్లు మంజూరు



మందమర్రిలో నిర్మించిన భవిత కేంద్రం

మంచిర్యాలఅర్బన్: భవిత కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. దివ్యాంగ పిల్లలకు భరోసానిచ్చే భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ర్యాంపులు, రైలింగ్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులు, కార్యకలాపాల గది నిర్మాణం, పిల్లలకు అనుకూలమైన అభ్యాస వాతావరణం కోసం అవసరాలకు అనుగుణంగా ఆధారిత పెయింటింగ్‌కు నిధులు మంజూరు చేస్తూ తెలంగాణ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో భవిత కేంద్రాలుండగా ఐదు చోట్ల మాత్రమే పక్కా భవనాలున్నాయి. మిగిలిన భవిత కేంద్రాలు పాఠశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. 196 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలుండగా ఒక్కో కేంద్రానికి ఇద్దరు ఐఈఆర్‌పీల చొప్పున 36 మందికిగానూ 24 మంది విధులు నిర్వహిస్తున్నారు. 12 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. భవిత కేంద్రాల్లో చేపట్టే పనుల అంచనాలు రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అదనపు నిధులు అవసరమైతే జస్టిఫికేషన్ నివేదికతో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశాలొచ్చాయి.

కేంద్రాల బలోపేతానికి..

భవిత కేంద్రాల్లో 196 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులున్నారు. ఇందులో 92 మంది ఇంటివద్దే ఉంటూ తగిన సేవలు అందుకుంటున్న వారున్నారు. మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధత్వం ఇలా 21 రకాలుగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను గుర్తించి సేవలు అందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి భవిత కేంద్రాల బలోపేతంపై కన్వర్జెన్స్‌లో దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు. నమోదును పెంచటం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్చటానికి ప్రత్యేక ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. రవాణా సౌకర్యం నిర్ధారించడం, పిల్లలకు వ్యక్తిగత అవసరాల ఆధారంగా అవసరమైన చికిత్స జోక్యాలు, మద్దతు అందించటానికి ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టులు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. గతేడాది భవిత కేంద్రాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించగా, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని పొందుపర్చారు. ప్రతీ చిన్నారి విద్యాపరంగా, అభివృద్ధిలో పురోగతి సాధించటంపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. స్వయం సహాయక సంఘాల సహాయంతో సీఎస్‌డబ్ల్యూయస్ గుర్తింపు వందశాతం కవరేజీకి చేరుకోవాలని ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

పక్కా భవనాలు ఎప్పుడో..?

ఉమ్మడి జిల్లాలో భవిత కేంద్రాలకు 17 చోట్ల పక్కా భవనాలున్నాయి. మిగిలిన 53 చోట్ల భవనాలులేక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులకు నిధులు కేటాయించినా పక్కా భవనాల నిర్మాణం విస్మరించారు. తాండూర్, బెల్లంపల్లి, దండేపల్లి, మందమర్రి, కోటపల్లిలో మాత్రమే భవిత కేంద్రాలున్నాయి. మిగిలిన కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. భవిత భవనాల నిర్మాణానికి స్థలగుర్తింపునకు ఎంఈవోలకు అప్పగించినట్లు తెలుస్తోంది. వీలైనంత త్వరగా స్థల కేటాయింపు, నిధులు మంజూరు చేస్తేనే ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యంగా మారనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలు, పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భవనాలు, మంజూరైన నిధులు ఇలా ఉన్నాయి.	జిల్లా	పక్కా భవనాలు	పాఠశాల ఆవరణలో	మంజూరైన నిధులు
	ఆదిలాబాద్	4	14	రూ.42,24,114
	కుమురంభీం	4	11	రూ.35,20,095
	నిర్మల్	4	15	రూ.44,58,787
	మంచిర్యాల	5	13	రూ.37,54,768
	మొత్తం	17	53	రూ.1,59,57,764

నిధుల ఖర్చు ఇలా..

ఉమ్మడి జిల్లా భవిత కేంద్రాల్లో చేపట్టే పనులకు నిధులు ఖర్చు చేయడంపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు రూ.1,59,57,764 నిధులు మంజూరయ్యాయి. ప్రాధాన్యత ప్రాతిపదికన అవసరాలను గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యకలాపాల గది నిర్మాణానికి యూనిట్‌కు రూ.7 లక్షల వరకు, ర్యాంపు, రైలింగ్‌తో కూడిన యాక్సెస్ చేయగల టాయిలెట్ నిర్మాణానికి యూనిట్‌కు రూ.లక్ష, భవనాల మరమ్మతులకు రూ.లక్ష (అవసరం ప్రకారం), ఇప్పటికే ఉన్న టాయిలెట్ల మరమ్మతులకు రూ.50వేలు, పిల్లల అభ్యాస, అవసరాలకు అనుగుణంగా పెయింటింగ్‌కు రూ. 1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధనలున్నాయి.

వాటర్ ట్యాంకు ఎక్కి యువకుడి హల్‌చల్



ట్యాంకు పైకి ఎక్కిన జాబ్రీ జమీల్

నస్పూర్: తనకు న్యాయం చేయాలని ఓ యువకుడు గురువారం పట్టణ పరిధిలోని వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్సై ఉపేందర్‌రావు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సందర్భంగా బాధితుడు జాబ్రీ జమీల్ మాట్లాడుతూ తనది విలేజ్ నస్పూర్ గ్రామమని, నస్పూర్ శివారు సర్వే నంబర్ 22లోని 6 ఎకరాల భూమిని మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, మరి కొందరితో కలిసి 2015 లో కొనుగోలు చేశామన్నాడు. అందులో తనకు పది శాతం వాటా ఉందన్నాడు. కొంత కాలం తర్వాత ఫిరోజ్‌ఖాన్ తన పదిశాతం వాటా కింద రూ.30 లక్షలు ఇస్తానని 2016లో అగ్రిమెంట్ చేసుకుని రూ.2.50 లక్షలు చెల్లించాడన్నారు. మిగిలిన డబ్బులు ఇవ్వకుండా భూమిని ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో న్యాయం చేయాలని, లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అనంతరం యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'పొట్టేల్' సినిమాకు గద్దర్ అవార్డు



దర్శకుడు సందీప్‌రెడ్డితో సాహిత్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహిత్ మోతుక్కూరి దర్శకత్వం వహించిన పొట్టేల్ సినిమాకు గద్దర్ అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లో ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించగా పొట్టేల్ సినిమాకు 'సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్' అవార్డు దక్కింది. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినగర్‌లో నివాసం ఉండే జానకి, ధర్మగౌడ్ కుమారుడు సాహిత్ దర్శకత్వం వహించగా గత అక్టోబర్ 25న చిత్రం విడుదలై విజయం సాధించింది. సాహిత్ దర్శకత్వం వహించిన మొదటి సినిమా 'సవారి'కి కూడా 2020లో ఐఐఎఫ్ఏ ఉత్తమ క్రిటిక్స్ అవార్డు లభించింది.

హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు కంపెనీ హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. గురువారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యజమాన్యంతో చర్చించామన్నారు. త్వరలోనే ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయన్నారు. అంతే కాకుండా భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం సెక్టార్ 3లలో కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాలలో సీబీఎస్ సిలబస్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నారు. ఈ సందర్భంగా 30 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య



సురేఖ (ఫైల్)

సాత్నాల: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన భోరజ్ మండలంలోని రాంపూర్(టి)లో గురువారం చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపిన వివరాల మేరకు జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శంకర్‌కు భోరజ్ మండలంలోని రాంపూర్(టి) గ్రామానికి చెందిన సురేఖ (35)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా శంకర్ మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి వచ్చి భార్యను వేధిస్తుండడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం రాత్రి మద్యం మత్తులో అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగడంతో కుటుంబ సభ్యులు 100కు సమాచారం అందించారు. పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు. గురువారం ఉదయం మరోసారి అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేఖ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని, ఆమె భర్త ఉరివేసి హత్యచేశాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. మృతురాలి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కట్నం వేధింపుల కారణంగా మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్న వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాలోని సింగరాయికొండకు చెందిన బండి ప్రసన్న (29)కు ఆంధ్రకు చెందిన ప్రమోద్ కుమార్‌తో 2022లో వివాహమైంది. పెళ్లయిన మూడు నెలల వరకు దంపతుల కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత అదనపు వరకట్నం కోసం ప్రమోద్ కుమార్ వేధించడం ప్రారంభించాడు. ఇటీవల ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి ద్వారకానగర్‌లో భార్యతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతుండడంతో బుధవారం ఉదయం భర్త పనికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి చీరతో ఉరేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు గురువారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



ఆకాష్, కళ్యాణ్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందినట్లు సీఐ స్వామి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన దాడి ఆకాష్ (21), అల్లకొండ కళ్యాణ్ (23) శుభకార్యాలకు డెకరేషన్ చేస్తుంటారు. బుధవారంరాత్రి ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ అదేరోజు రాత్రి, కళ్యాణ్ గురువారం మృతి చెందారు. ఆకాష్ తండ్రి రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..

భైంసారూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ నైలు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్ (20) బుధవారం రాత్రి చాక్‌పెల్లి వెళ్లేందుకు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై నిలబడి ఉన్నాడు. ఈక్రమంలో భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కన్నెపల్లిలో ఒకరు..

దండేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన బోరె మహేశ్ (40) గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కన్నెపల్లి నుంచి లక్సెట్టిపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలులోంచి కిందపడి వ్యక్తి..

బెల్లంపల్లి: రైలులోంచి కిందపడి ఒకరు మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. నాగపూర్‌కు చెందిన నిషాంత్ (42) బుధవారం రాత్రి హుబ్లీలో ఉన్న తన బంధువుల ఇంటికి వారణాసి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. రైలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే నిషాంత్ రైలులో నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహానికి గురువారం పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి భార్య పూర్వీకి అప్పగించామని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన జెలిగం విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని మోచిగల్లికి చెందిన తుర్పటి గంగాధర్‌కు ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నిందితుడు రూ.7లక్షల 5వేలు తీసుకున్నాడు. నకిలీ ప్రొసిడింగ్ ఇచ్చి జాబ్ వచ్చిందని నమ్మబలికాడు. ఆ తర్వాత అతను అక్కడికి వెళ్లగా నకిలీ ప్రొసిడింగ్ అని తెలుసుకున్నాడు. మోసపోయానని గ్రహించి గురువారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సతీశ్ మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండేటి సతీశ్ (38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు. మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సతీశ్ ఇటీవల రెండు ప్లాట్లు కొనుగోలు చేసి ఇంటినిర్మాణం చేపట్టాడు. ఈక్రమంలో అప్పులు చేశాడు. అంతేకాకుండా కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఒకవైపు అప్పులబాధ, మరోవైపు కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే వరండాలో ఒంటరిగానే పడుకున్నాడు. తెల్లవారేసరికి రేకుల షెడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని అతని తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కొత్తూర్‌లో యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల రవి (36) బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖుర్షీద్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న రవి ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు



బెజ్జూర్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై సురేశ్ గురువారం తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టు చేసినట్లు తెలిపారు. రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బెజ్జూర్: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ కార్యకర్తలు బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, మండల మాజీ అధ్యక్షుడు జాడి దిగంబర్, నాయకులు వసీఉల్లాఖాన్, తాళ్ల ఇందిరా, రాజారాం, ప్రవీణ్, కిష్టయ్య, కృష్ణ, శ్యాంసుందర్, రుషి, గోపాల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ ఎంపిక పోటీలు



జిల్లా కేంద్రంలో ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పోటీలు మూడోరోజు గురువారం హోరాహోరిగా సాగాయి. మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో గ్రీన్, బ్లూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్లూ జట్టు 268 పరుగులు చేసి విజయం సాధించింది. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ పోలీసు బెటాలియన్‌లో నిర్వహించిన పోటీల్లో యెల్లో జట్టు 165 పరుగులు చేసి విజయం సాధించింది. మందమర్రిలోని సింగరేణి మైదానంలో జరుగుతున్న పోటీల్లో వైట్ జట్టు 229 పరుగులు చేసి విజయం సాధించిందని హెచ్‌సీఏ కోచ్ ప్రదీప్ తెలిపారు.

మొక్కజొన్నల చోరీ నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

నర్సాపూర్(జి): ఏప్రిల్ 23న 325 క్వింటాళ్ల మొక్కజొన్నలు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధితుడు కల్లూరుకు చెందిన బొద్దుల శ్రీనివాస్ మే13న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం రాజీవ్ నగర్ తాండకు చెందిన బాదావత్ సంతోశ్, కంటేశ్వర్‌కు చెందిన అబ్దుల్ రజాక్ లారీ డ్రైవర్లు 325 క్వింటాళ్ల మొక్కజొన్నలను కామారెడ్డి సమీపంలో ఉన్న స్నేహ చికెన్ ఫార్మ్ గోదాంకు పీవీ ఏజెన్సీ ద్వారా విక్రయించి రూ.7,48,000 సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తామే విక్రయించినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్దనుంచి 2 లారీలు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

'గురుకుల సొసైటీ కార్యదర్శిని తొలగించాలి'



మాట్లాడుతున్న రాజనర్సు

బెల్లంపల్లి: గురుకుల విద్యాలయ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణిని ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు మరుగుదొడ్లు కడిగితే తప్పేంటని, గదులు శుభ్రం చేసుకోవడంతో పాటు కూరగాయలు తరగాలని, ఎవరి బట్టలు వారే ఉతుక్కోవాలని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎస్సీలకు చెందిన ఉన్నతాధికారిని గురుకుల సొసైటీ కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు రమేశ్, నారాయణ, రాజ్‌కుమార్, ప్రసాద్, శేఖర్, శివాజీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య శాఖలో ఖాళీలకు ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న రెండు నర్సింగ్ ఆఫీసర్, 1 డీడీఎం పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https:// mancherial. telangana. gov. in లో సంప్రదించాలని తెలిపారు.

తర్లపాడ్‌లో అగ్నిప్రమాదం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో గురువారం రాత్రి పల్లపు లక్ష్మి ఇంట్లో కట్టెలపొయ్యి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు.